క్లుప్తంగా

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

చెరుకుపల్లి: కనగాల గ్రామంలోని బీఈడీ కళాశాల ప్రాంగణంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు హాజీ మహ్మద్ ఖాసీం సాహెబ్ అండ్ మహ్మద్ గాలాబ్ సాహెబ్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు అబ్దుల్ సమ్మద్ శనివారం తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, పెద కాకాని శంకర కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో శిబిరం ఉదయం 9 – మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటుందని చెప్పారు. రేషన్ కార్డు లేదా ఆధార్ కార్డు, ఓటరు కార్డు జిరాక్స్ కాపీ తీసుకురావాలని తెలిపారు.

రేపల్లెలో ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు డిమాండ్

రేపల్లె: రేపల్లె పట్టణంలో విద్యుత్ డివిజనల్ కార్యాలయం, విద్యుత్ రెవెన్యూ కార్యాలయం తక్షణం ఏర్పాటు చేయాలని పట్టణాభివృద్ధి సంఘం కార్యదర్శి సి.వి. మోహన్‌రావు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ.. బాపట్ల విద్యుత్ సర్కిల్ ఏర్పడి మూడు సంవత్సరాలు గడిచినా కార్యాలయాలు రేపల్లెలో ఏర్పాటవ్వకపోవడం బాధాకరం అని తెలిపారు. ప్రస్తుతం రేపల్లె, వేమూరు నియోజకవర్గాలు ఇంకా గుంటూరు సర్కిల్ పరిధిలోనే ఉండటం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సంబంధిత సాంకేతిక సమస్యల పరిష్కారం కోసం గుంటూరులోని సర్కిల్ కార్యాలయానికి, బిల్లుల ఇబ్బందులు తీరాలంటే తెనాలి విద్యుత్ రెవెన్యూ కార్యాలయానికి వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు.

ట్రాక్టర్ కిందపడి వ్యక్తి మృతి

రేపల్లె: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పట్టణ సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లూరు గ్రామానికి చెందిన నల్లూరి రమేష్ బాబు (45) శనివారం తన ఇంటి వద్ద ట్రాక్టర్ రిపేరు చేసి స్టార్ట్ చేశాడు. అయితే ట్రాక్టర్ గేర్‌లో ఉండటంతో ఒక్కసారిగా ముందుకు కదలటంతో రమేష్ బాబు ఇంజిన్ చక్రం కిందపడి గాయాలపాలయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. రమేష్‌బాబు భార్య వాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

18న సర్వసభ్య సమావేశం

కొల్లిపర: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి అధ్యక్షతన 18వ ఉదయం 11 గంటలకు సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు శనివారం ఎంపీడీవో విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. సర్వసభ్య సమావేశానికి మండలంలోని 20 గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు అన్ని శాఖల అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అదేవిధంగా ప్రజాప్రతినిధులు ప్రజల సమస్యలను, గ్రామ సమస్యలను తెలుసుకొని అధికారుల దృష్టికి తీసుకువచ్చి ప్రజాప్రతినిధులు అధికారులు సమన్వయంతో సమస్యలను పరిష్కరించేలా కృషి చేయాలని సూచించారు.

బాలిక అదృశ్యం


తెనాలిరూరల్: బాలిక అదృశ్యమవడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు పట్టణ చెంచుపేటకు చెందిన 17 ఏళ్ల బాలిక తొమ్మిదో తరగతి చదవి ఇంటి వద్దే ఉంటోంది. శుక్రవారం ఇంటి నుండి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించగా త్రీ టౌన్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు.

ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్పునకు ఎంపిక



ప్రత్తిపాడు: ప్రత్తిపాడు మండలంలో ముగ్గురు విద్యార్థులు నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)కు ఎంపికైనట్లు మండల విద్యాశాఖాధికారి సీహెచ్ రమాదేవి తెలిపారు. తుమ్మలపాలెం జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన విద్యార్థి మామిడి హేమ 101 మార్కులు, కోయవారిపాలెం హైస్కూల్‌కు చెందిన పాలపర్తి పూజిత 77 మార్కులు, ఉల్లంగుల లోక వివేకానంద 95 మార్కులు సాధించి ఉపకార వేతనాలకు అర్హత పొందారు. వీరికి ఏడాదికి రూ. 12 వేలు చొప్పున నాలుగేళ్ల పాటు ఉపకార వేతనాలు అందనున్నాయి. ఈ సందర్భంగా స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులకు ఎంఈఓలు సీహెచ్ రమాదేవి, జి.లీలారాణిలు ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు.

పశుసంవర్ధక శాఖ ఏడీగా కె. సుగణ్యరావు



ప్రత్తిపాడు: పశు సంవర్ధకశాఖ ప్రత్తిపాడు అసిస్టెంట్ డైరెక్టర్ (సహాయ సంచాలకులు)గా డాక్టర్ కట్టా సుగణ్యరావు శనివారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇప్పటి వరకు ఇక్కడ విధులను నిర్వర్తిస్తున్న శ్రీనివాసరెడ్డి బదిలీ కాగా, ఆయన స్థానంలో ప్రకాశం జిల్లా మద్దిపాడు నుంచి కట్టా సుగణ్యరావును ప్రత్తిపాడుకు బదిలీ చేస్తూ పశుసంవర్ధకశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈనేపథ్యంలో ఆయన స్థానిక పశువైద్యశాలలో ఏడీగా బాధ్యతలు స్వీకరించారు. మూగజీవాలకు మెరుగైన వైద్యం అందిస్తానని తెలిపారు.

వైభవంగా అమ్మవారి అనంతోత్సవాలు



అమ్మవారికి అన్నాభిషేకం చేస్తున్న అర్చకులు, కమిటీ సభ్యులు



అభిషేకం చేస్తున్న దృశ్యం

బాపట్ల టౌన్: మండలంలోని జిల్లెళ్ళమూడి గ్రామంలో వేంచేసియున్న మాతృశ్రీ అనసూయాదేవి ఆలయంలో అమ్మవారి అనంతోత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ నెల 12 నుంచి ప్రారంభమైన వేడుకలు శనివారంతో ముగిశాయి. ఈ వివరాలను విశ్వజనని పరిషత్ కోశాధికారి సుబ్రమణ్యం తెలిపారు. ఏటా భక్తులు అమ్మవారి ఆరాధనా కార్యక్రమాలు విశేషంగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఈ నెల 12న మూల విరాట్‌కు 11 మంది ఋత్విక్కులచే మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం నిర్వహించారన్నారు. సాయంత్రం లక్ష మల్లె పువ్వులతో అర్చన వైభవోపేతంగా చేశారని చెప్పారు. శనివారం విఘ్నేశ్వర పూజ, వరుణ హోమం, ఋష్యశృంగ హోమం, శ్రీవిశ్వజనని చరిత హోమం, పూర్ణాహుతి, సహస్ర మృత్తికా కలశాలతో అమ్మవారికి ఘటాభిషేకం జరిగాయి. అమ్మ భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అమ్మ దర్శనార్థం వచ్చిన బాలికలు కోలాట నృత్యాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. అమ్మవారికి పూలంగి సేవ, సామూహిక శ్రీ లలితా సహస్రనామ స్తోత్ర పారాయణ మహా హారతి, కార్యక్రమాలు కనుల పండువగా జరిగాయి. ఈ కార్యక్రమంలో విశ్వజనని పరిషత్ కమిటీ సభ్యులు, అలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

యోగా దినోత్సవాన్ని విజయవంతం చేద్దాం



కర్లపాలెంలో అవగాహన ర్యాలీలో అధికారులు, స్థానికులు

కర్లపాలెం: ఈ నెల 21న జరగనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేద్దామని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు చెప్పారు. కర్లపాలెంలో శనివారం అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండల కేంద్రంతోపాటు అన్ని గ్రామ పంచాయతీలలో యోగా దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించుకోవాలని చెప్పారు. యోగా దినోత్సవంలో పాల్గొనేందుకు ప్రతి మండలం నుంచి ప్రజలు విశాఖపట్నం వెళ్లేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ వేణుగోపాల్‌రెడ్డి, ఉప సర్పంచ్ అహ్మద్ బాషా, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది, వీవోఏలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులను వినియోగించుకోవాలి



గ్రామసభలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంపీపీ వనజ తదితరులు

కర్లపాలెం: గ్రామాలలో ఉపాధి హామీ పథకం కింద పనులను ప్రజలు వినియోగించుకోవాలని ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంపీపీ యారం వనజ పేర్కొన్నారు. శనివారం పేరలిపాడు, నల్లమోతువారిపాలెం గ్రామాలలో ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీ గ్రామసభలు నిర్వహించారు. పేరలిపాడు గ్రామసభలో ఎంపీపీ, ఎంపీడీవోలు మాట్లాడుతూ గ్రామాలలో జరిగిన పనుల నాణ్యతను, కూలీలకు జమ చేసిన నగదు వివరాలను తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. నల్లమోతువారిపాలెం గ్రామసభలో ఎంపీటీసీ సభ్యుడు తాండ్ర సాంబశివరావు మాట్లాడుతూ గ్రామంలోని పేదలందరికీ పనులు కల్పించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో పేరలిపాడు సర్పంచ్ కాగిత కరుణకుమారి, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద రక్తదాన శిబిరానికి విశేష స్పందన




శిబిరంలో పాల్గొన్న కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రమణ్యం, డాక్టర్ సౌభాగ్యవాణి

తెనాలిటౌన్: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా స్థానిక చెంచుపేటలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో సుమారు స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు రక్తదాతలు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేశారు. బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ జి.రాధబాయ్ పాల్గొని రక్తదాతలపై ప్రతిజ్ఞ చేయించారు. సత్యం, శివం, సుందరం సేవా కేంద్రం వ్యవస్థాపకులు తన్నీరు శివశంకర్ మాట్లాడుతూ రక్తం కొరత తీవ్రంగా ఉన్న ప్రస్తుత తరుణంలో యువత రక్తదానంపై అవగాహన పెంపొందించుకుని ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రమణ్యం, వైద్య శాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి, మాలేపాటి హేమకుమార్, షేక్ షఫీ, అన్నం రవి, నాగమోతు నారాయణ, లోకేష్, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది ఎం.బాపనయ్య, రమాదేవి, శ్యామల, శ్రీను ఉన్నారు.

ప్రజలపై అదనపు విద్యుత్ భారం

తెనాలిటౌన్: కూటమి ప్రభుత్వం అబద్ధపు హామీలతో అధికారం చేపట్టి ప్రజలపై మోయలేని భారాలను మోపుతుందని సీపీఎం పట్టణ కార్యదర్శి కె.బాబుప్రసాద్ ఆరోపించారు. శనివారం స్థానిక చెంచుపేటలోని మార్కెట్‌యార్డు, సివిల్ సప్లయిస్ గొడౌన్ ప్రాంతాల్లో పర్యటించిన కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఏడాది కాలంలో ప్రజలపై మోపిన పన్నుల భారం వివరించారు. రాబోయే రోజుల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. విద్యుత్ బిల్లుల భారాన్ని కార్మికులకు వివరించారు. ఇంటి పన్నుల పేరుతో విధిస్తున్న అదనపు భారాన్ని తెలియజేశారు. కార్పొరేట్ సంస్థలకు రెడ్ కార్పెట్ వేస్తూ పేదల జేబులు చిల్లుపెడుతున్నారని కూటమి ప్రభుత్వంపై నిప్పులు చేరిగారు. కార్యక్రమంలో జి.బాబురావు, టి.వీరయ్య, జి.యోహాన్, నరసింహారావు, కమలకరరావు, శివయ్య, ఏలియా, సుశీలరావు, వీరాంజనేయులు, సుధాకర్, బంగారుబాబు, పోతురాజు, రవికుమార్, తదితరులు ఉన్నారు.

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పథకాలపై అవగాహన



విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేస్తున్న శ్రీనివాసరావు, శంకరరావు

గుంటూరు ఎడ్యుకేషన్: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా అమలవుతున్న పథకాలు, లోన్లు, సబ్సిడీ బ్యాంక్ అకౌంట్స్ అమలు తీరుపై గిరిజన, గ్రామీణ విద్యార్థులకు, యువతకు అవగాహన కల్పించాల్సిన అవసరముందని ఆర్బీఐ ప్రాంతీయ రీసోర్స్ పర్సన్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ రూరల్ అండ్ ట్రైబల్ డెవలప్మెంట్ సోషల్ సర్వీస్ సొసైటీ(ఏఐఆర్‌టీడీఎస్), సమీకృత గ్రామీణ గిరిజనాభివృద్ధి సేవా సంస్థ(ఆర్టిడ్స్) సంయుక్త ఆధ్వర్యంలో బ్రాడీపేట 6/14లోని శ్రీవేంకటేశ్వర కాలేజ్ ఆఫ్ నర్సింగ్ సమావేశ మందిరంలో గ్రామీణ, గిరిజన విద్యార్థులు, యువతకు 'డిపాజిటర్స్ ఎడ్యుకేషన్' పై శనివారం జిల్లాస్థాయి వర్క్ షాప్ నిర్వహించారు. మరొక రీసోర్స్ పర్సన్ ఆర్ఎస్ శంకర్రావు మాట్లాడుతూ ఇన్‌స్రూ పథకాలు, పొదుపు ఖాతాలు, బ్యాంక్ అకౌంట్స్ నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అవగాహన సదస్సుకు అధ్యక్షత వహించిన కార్యదర్శి వై.సాంబశివరావు మాట్లాడుతూ ఏ బ్యాంకులో అకౌంట్ ఉన్న సరే వారికి తప్పనిసరిగా జీవనజ్యోతి, అటల్ పెన్షన్ యోజన, సురక్ష బీమా వంటి పథకాలు పొందవచ్చునని చెప్పారు. గిరిజన, గ్రామీణ ప్రాంతాలలో సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ పథకాలను ఇన్ఫర్మేషన్ ఎడ్యుకేషన్ కమ్యూనికేషన్ ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఏఐఆర్టీడీఎస్ అధ్యక్షురాలు పి.విజయలక్ష్మి, కోఆర్డినేటర్ షేక్ హుస్సేన్ పాల్గొన్నారు.

వైభవంగా తాళ్లపాక అన్నమాచార్య జయంత్యుత్సవం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శనివారం పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్య జయంత్యుత్సవాన్ని నిర్వహించారు. గాయత్రీ మహిళా మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఊపిరితిత్తుల వైద్యనిపుణులు డాక్టర్ శ్రీకంటి రఘు, మైథిలి దంపతులు, ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, భూసురపల్లి వెంకటేశ్వర్లు జ్యోతిప్రజ్వలతో ప్రారంభించారు. అనంతరం కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత మల్లాది సూరిబాబును సత్కరించారు. మల్లాది సోదరులు శ్రీరామప్రసాద్, రవికుమార్ (విజయవాడ) శాస్త్రీయ సంగీత గాత్ర యుగళ కచేరీ అలరించింది. సంగీత త్రిమూర్తుల కీర్తనలు, అన్నమయ్య కీర్తనలను శ్రావ్యంగా ఆలపించారు. కార్యక్రమంలో మండలి అధ్యక్షురాలు డాక్టర్ పి.విజయ, ప్రధాన కార్యదర్శి ఎంవై శేషురాణి, ఉపాధ్యక్షురాలు డాక్టర్ ఎం.రాజరాజేశ్వరి, మాధవపెద్ది మీనాక్షి, పాటిబండ్ల లలితాదేవి, కార్యదర్శి ఏవీ మంగాదేవి, కోశాధికారి విజయలక్ష్మి సత్కరించారు.

యోగాసనాలతో ఆరోగ్యం, ఉల్లాసం

ఎంపీడీవో అత్తోట దీప్తి



తెనాలిటౌన్: యోగసనాలతో మంచి ఆరోగ్యం, మానసిక ఉల్లాసం పెంపొందుతాయని ఎంపీడీవో అత్తోట దీప్తి పేర్కొన్నారు. శనివారం రూరల్ మండలం అంగలకుదురు గ్రామంలో నిర్వహించిన యోగాంధ్ర శిక్షణ శిబిరంలో పాల్గొని మాట్లాడారు. యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రభుత్వం జూన్ 21 తేదీ వరకు నెల రోజుల పాటు నిర్వహిస్తున్న విషయాన్ని వెల్లడించారు. ప్రతి రోజు గ్రామ గ్రామన గంట సేపు యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యోగాసనాలతో మనిషికి శరీరక, మానసిక ఉల్లాసం పెంపొందడమేకాక మంచి ఆరోగ్యం చేకూరుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వైవిడి ప్రసాద్, పంచాయతీ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు



నగరంపాలెం: ఎస్‌వీఎన్‌కాలనీలోని పద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థాన ఆవరణలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ముగిశాయి. స్వామిని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం వేళలో ఆలయ ద్వాదశ ప్రదక్షిణాలు, ఊంజల్ సేవ నిర్వహించారు. ఆలయ అధ్యక్షులు వట్టికూటి పూర్ణచంద్రరావు, కార్యదర్శి నల్లమోతు వెంకటరత్తయ్య, కోశాధికారి డాక్టర్ పుచ్చా వెంకటమల్లేశ్వర్ పాల్గొన్నారు.

కార్మికులకు తల్లికి వందనం వర్తింపజేయాలి

లక్ష్మీపురం: తల్లికి వందనం పథకం ఆప్కాస్‌లో ఉన్న మున్సిపల్ కార్మికులందరికీ వర్తింపజేయాలని సీపీఐ నగర కార్యదర్శి, మున్సిపల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కోట మాల్యాద్రి డిమాండ్ చేశారు. శనివారం 9వ శానిటరీ డివిజన్ లాన్‌చెస్టర్ రోడ్డు కార్యాలయం వద్ద కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. సమ్మె కాలంలో మున్సిపల్ కార్మికులందరినీ ప్రభుత్వ పథకాలకు అర్హులను చేస్తామన్న అధికారులు నేడు దానిని మరిచారని అలాగే పారిశుద్ధ్య కార్మికులను గొప్పగా చూసుకుంటామని చెబుతున్న ప్రభుత్వాలు మున్సిపల్ కార్మికులను చిన్నచూపు చూడడం సరైనది కాదన్నారు. వెంటనే ప్రభుత్వ పథకాలకు మున్సిపల్ కార్మికులందరినీ లబ్ధిదారులుగా చేసి వారిని ఆదుకోవాలని అన్నారు. ఇంజినీరింగ్ కార్మికుల జీతాలు పెంపుదలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు చినబోతుల వెంకట్రావు ఉపాధ్యక్షులు కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఈవెంకట్రావు కోశాధికారి కోటి వీరాంజనేయులు పాల్గొన్నారు.

వాగ్దానాలు అమలు చేయాలి

పెదకాకాని: ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ అన్నారు. పెదకాకాని సుందరయ్యకాలనీలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో నన్నపనేని మట్లాడుతూ పెదకాకాని దశాబ్దాలుగా పెదకాకాని మండల పరిధిలోని సుందరయ్య కాలనీ స్వర్ణపురి కాలనీ ఎస్టీ కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, వడ్డెర కాలనీ, జాన్ హార్స్ ఫర్ కాలనీ వాసులు ప్రభుత్వ స్థలాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నారన్నారు. ఏళ్లు గడుస్తున్నా, ప్రభుత్వాలు మారుతున్న వారికి ఇంటి పట్టాలు ఇవ్వలేదని నన్నపనేని శివాజీ ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి నేతలు ఎన్నికల సమయంలో ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్న అందరికీ ఇళ్ల పట్టాలిస్తామని, ఇల్లు లేని వారికి గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాలలో రెండు సెంట్లు ఇస్తానని వాగ్దానాలు చేసి నేడు అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్న వాటి గురించి ఆలోచించడం లేదన్నారు. ఎది సంవత్సరాలుగా కొత్త రేషన్ కార్డులు ఇవ్వటం లేదని, జారీలో అవకతవకలు వల్ల పథకాలు చాలామందికి అందడం లేదన్నారు.

మత్తు పదార్థాలను అరికట్టాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

నిజాంపట్నం: ప్రమాదకరమైన మత్తు పదార్థాలను అరికట్టేందుకు అందరూ సహకరించాలని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి.వెంకటేశ్వర్లు చెప్పారు. నగరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం ఆధ్వర్యంలో శనివారం నిజాంపట్నం సచివాలయం వద్ద నిర్వహించిన కేర్ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. నాటుసారా తాగిన వారు జీవితాన్ని నాశనం చేసుకోవటమే కాకుండా కుటుంబాలను నాశనం చేస్తున్నారని పేర్కొన్నారు. శరీరంలోని ప్రతి అవయవం దెబ్బ తింటుందని, నాటుసారా మానివేయటంతోపాటు ఇతరులూ మానివేసేలా చైతన్య పరచాలని కోరారు. నాటుసారా తయారు చేసినా, విక్రయించినా చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. ఎవరైనా ఇలాంటి పనులకు పాల్పడితే తమకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచటం జరుగుతుందన్నారు. ప్రజలకు నాటు సారాతో కలిగే దుష్ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ మార్బూరి శ్రీరామ్ ప్రసాద్, జెడ్పీటీసీ సుబ్బయ్య, కార్యదర్శి శ్రీనివాసరావు, వీఆర్వో ఆంజనేయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపల్లె రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్‌కు అవార్డు



మంత్రి సత్యకుమార్ నుంచి అవార్డు అందుకుంటున్న వీరరాఘవయ్య

రేపల్లె: దాతల నుంచి రక్త సేకరణలో రాష్ట్రస్థాయిలో రేపల్లె ఇండియన్ రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ శనివారం అవార్డు అందుకుంది. ప్రపంచ రక్త దాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని గుంటూరులోని భారతీయ విద్యాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చేతుల మీదుగా ఈ అవార్డును రేపల్లె బ్లడ్‌బ్యాంక్ చైర్మన్ డాక్టర్ వసంతం వీరరాఘవయ్య అందుకున్నారు. రక్త సేకరణలో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచిన బ్లడ్ బ్యాంకు సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ వసంతం వీరరాఘవయ్య మాట్లాడుతూ.. దాతల సహకారంతో 17 సంవత్సరాల క్రితం రేపల్లె ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో నెలకొల్పబడిన బ్లడ్ బ్యాంక్ సెంటర్ బాపట్ల జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ నారాయణ బట్టు సహకారంతో రేపల్లె, బాపట్ల పట్టణ పరిసర ప్రాంతాలలో అనేక శిబిరాలు నిర్వహించిందన్నారు. దాతల సహకారంతో సామగ్రిని, అంబులెన్స్‌ను సైతం సమకూర్చటం జరిగిందన్నారు. ప్రభుత్వం అవార్డుకు ఎంపిక చేయడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో ప్రజలకు మరింత సేవ చేస్తామన్నారు.

వైభవంగా సామూహిక హారతి



వెంకటేశ్వర స్వామి పూజలో సమరత సేవ ఫౌండేషన్ సభ్యులు

చెరుకుపల్లి: రాజవోలు గ్రామంలో వేంచేసియున్న శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో సామూహిక హారతి కార్యక్రమం శనివారం జిల్లా దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యన్నారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తలుగా సమరసత సేవ ఫౌండేషన్ జిల్లా ప్రచారక్ జంజనం హేమ శంకరరావు, పడమట వెంకటేశ్వరరావులు వ్యవహరించారు. ఈ సందర్భంగా పొన్నపల్లి సత్యన్నారాయణ మాట్లాడుతూ.. ఇప్పటివరకు బాపట్ల జిల్లాలో తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆర్థిక సాయంతో సమరసత సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 20 హిందూ దేవాలయాలు నిర్మించటం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో కూడా మరిన్ని నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు పరదామ కోటేశ్వరరావు, వై. మధు, వై. సత్యన్నారాయణ, వెంకట రాఘవేంద్ర రావు, మహిళా కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు సారె సమర్పించాలి

రేపల్లె: ఆషాఢంలో గ్రామదేవతలకు సారె సమర్పించాలని బాపట్ల జిల్లా దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ చెప్పారు. మండలంలోని పోటుమెరక ఎస్టీ కాలనీలో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి సత్సంగం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, ఫౌండేషన్ సభ్యులు రేపల్లె చెంచయ్య, గరికపాటి కామయ్య, సుందరరామిరెడ్డి, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌ల పిల్లలకూ 'తల్లికి వందనం' వర్తింపచేయాలి



అనిల్‌కుమార్

బాపట్ల టౌన్: తల్లికి వందనం పథకం రాష్ట్రంలోని సర్పంచ్‌ల పిల్లలకు కూడా వర్తింపచేయాలని బాపట్ల మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బొలిమేర అనిల్‌కుమార్ తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌ల పిల్లలకు తల్లికి వందనం పథకం వర్తించలేదన్నారు. అనేక నిబంధనలతో అర్హులైన వారికి కూడా సాయం అందలేదన్నారు. ఈ విషయంపై డెప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చొరవ తీసుకోవాలని కోరారు. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా పేర్కొనడం దారుణమని అన్నారు. సర్పంచ్‌ల్లో ఎక్కువ మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలేనని గుర్తుచేశారు. సర్పంచులకు గౌరవ వేతనం నెలకు రూ.3 వేలు ఇస్తూ ప్రభుత్వ ఉద్యోగులని చెప్పడం చాలా దారుణమన్నారు. వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్‌లు స్పందించాలన్నారు. సర్పంచ్‌ల పిల్లలకు పథకం వర్తింపచేయాలని, లేని పక్షంలో ఆందోళన నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ప్రపంచ దేశాలకు ఆదర్శప్రాయుడు చేగువేరా

తెనాలిటౌన్: స్థానిక గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో చేగువేరా జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. సీపీఐ పార్టీ తెనాలి నియోజకవర్గ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు పాల్గొని చేగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాశం వెంకటేష్ మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్య వ్యతిరేక సింహస్వప్న, పోరాటాల స్ఫూర్తి ప్రధాత చేగువేరా జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. జూన్ 14వ తేదీ చేగువేరా జయంతిగా తెలిపారు. వైద్య విద్యనభ్యసించి మోటార్ సైకిల్‌పై ప్రపంచ యాత్రచేశారని గుర్తుచేశారు. పేదరికాన్ని నిర్మూలించాలనే ఆలోచనతో అనేక పోరాటాలు చేసినట్లు వెల్లడించారు. నేటి యువత విద్యార్థులు చేగువేరా భావజాలాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు గద్దు శివ, ఎం.కిరణ్‌బాబు, కె.రవితేజ, కోలా శేఖర్, తేజ, హకీం, రాహుల్, అరుణ్, సాయి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో యోగా శిక్షణ తరగతులు



ప్రత్తిపాడులో యోగాసనాలు వేస్తున్న గ్రామస్తులు

ప్రత్తిపాడు: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో శనివారం యోగా శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రత్తిపాడు-1, 2, 3 సచివాలయాలు, పాతమల్లాయపాలెం, తిక్కిరెడ్డిపాలెం, కోయవారిపాలెం, మేడావారిపాలెం, నడింపాలెం, తుమ్మలపాలెం, గొట్టిపాడు, గనికపూడి గ్రామాల్లో ఆయా గ్రామాల శిక్షకులు రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రజలతో యోగాసనాలు వేయించారు. యోగా చేసే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, యోగా వలన ప్రయోజనాలను వివరించారు.

■ ప్రత్తిపాడు మండలంలో యోగాంధ్ర కార్యక్రమం అభాసుపాలవుతుందంటూ ఇటీవల వరుసగా 'సాక్షి'లో కథనాలు ప్రచురితమవుతుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో యోగా శిక్షణ తరగతులను నిర్వహించి, అత్యధిక మంది శిక్షణకు హాజరయ్యేలా చర్యలు తీసుకున్నారు.